మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

# జరభద్రం.. రైతన్న





- చిత్తడి కాలం.. పాములతో పైలం..
- ప్రకృతి వైపరీత్యాలు...
- విద్యుత్‌తో పొంచి ఉన్న ప్రమాదాలు

**దేవరకద్ర, ఆగస్టు17 ప్రభాతవార్త:** జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ క్షేత్రాల్లో వానాకాలం పంటల సాగు పనులు ఊపందుకుంటున్నాయి. పొలం పనులలో రైతులు వ్యవసాయ కూలీలు తీరిక లేకుండా ఉంటున్నారు. వ్యవసాయ పనులో నిమగ్నమైన రైతులకు, వ్యవసాయ కూలీలకు అనుకోకుండా సంభవించే ప్రకృతి వైపరీత్యాలు, పంట పొలాలలో ఉండే విద్యుత్ మరమ్మత్తు పనులు, మందుల పిచికారి పనులతో ఒక్కోసారి ప్రమాదాలకు గురవుతుంటారు. నిత్యం వ్యవసాయ క్షేత్రాలలో ఉంటూ పంట దిగుబడి పెంచుకోవడం కోసం పొంచి ఉన్న ప్రమాదాలను అధిగమించడం రైతులకు పరీక్ష కాలం వంటిది. ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేని పరిస్థితి. పిడుగుపాటు విద్యుత్ విపత్తులు విషపురుగుల సంచారం మందుల పిచికారి వంటి సమయాలలో రైతన్నలు ప్రమాదాల బారిన పడడంతో పాటు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు తరచూ వింటూనే ఉన్నాం. పొలాలలో పచ్చిక బయలు పెరగడంతో ఎక్కడ ఏ విషపురుగు ఉందో గుర్తు పట్టడం కష్టంగా ఉంటుంది. అయితే అన్నదాత అప్రమత్తంగా ఉండి కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను అధిగమించవచ్చని దేవరకద్ర, కౌకుంట్ల, వ్యవసాయ అధికారులు శివకుమార్, రాజేందర్ అగర్వాల్, సూచిస్తున్నారు.

## విపత్తులతో అప్రమత్తత అవసరం...

వర్షాకాలంలో పొలాలలో ఉన్న కరెంటు మోటార్లలో వర్షం నీరు చేరి సమస్యలు వస్తుంటాయి. వీటిని సరి చేసేందుకు రైతులు జాగ్రత్తలు పాటించకుండా మోటార్లను ముట్టుకోవడం వల్ల విద్యుత్ ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. మోటార్ బోర్డులో స్టార్టర్లు వర్షానికి తడవకుండా ఉండే ప్లాస్టిక్ డబ్బాలు అమర్చుకోవాలి. మోటార్లను ఆన్ ఆఫ్ చేసే సమయంలో చేతులకు తడి లేకుండా చూసుకోవాలి. చేతులకు గ్లౌజు వాడడం వల్ల విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ఉండవచ్చు. రైతులు ఎప్పుడు తమ వెంట టెస్టర్ కాళ్లకు చెప్పులు ఉంచుకుంటే మంచిది. ఇక మెరుపులతో కూడిన వర్షాలు కురియడం సర్వసాధారణం. ఈ సమయంలో తడవకుండా ఉండేందుకు రైతులు చెట్ల కిందకు వెళ్లి తల దాచుకుంటారు. ఇలాంటి సమయంలో చెట్లపై పిడుగులు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ చెట్ల కిందకు వెళ్ళకూడదు. విద్యుత్ ప్రసరించే వస్తువులు విద్యుత్ తీగల కు దూరంగా ఉండాలి. వర్షంలో తడవకుండా ఉండేందుకు ప్లాస్టిక్ దుస్తులను లేదా రైన్ కోట్లను ధరించాలి. చెట్లు, విద్యుత్ తీగల కు దూరంగా పొలాల గట్లపై ఉండాలి.

## పాములతో జాగ్రత్త....

ప్రస్తుతం విషపూరిత జీవులు విరివిరిగా పంట పొలాలలో సంచరిస్తూ ఉంటాయి. ముఖ్యంగా పాములు ఎలుకలను కప్పలను తినేందుకు బయట తిరుగుతూ చెట్లపొదల్లో ఉంటాయి. అలాంటి సమయంలో అప్రమత్తంగా ఉంటూ ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా పాము కాటేస్తే ఒంటిపై రెండు లేదా నాలుగు ఆకారపు గుర్తు లు పడతాయి. అరగంటలో విషం వళ్లంతా పాకి నాడి వ్యవస్థ పై ప్రభావం చూపుతుంది. కండ్లు మూతలు పడడం చేతులు కాళ్లకు పక్ష వాతం రావడం, మాట ఆగిపోవడం, నాలుకకు రుచి తెలియకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. రక్తపింజర కరిచిన భాగం ఉబ్బి తీవ్రంగా నొప్పి కలిగిస్తుంది. అరగంటలో నోట్లోంచి చెవుల్లోంచి రక్తస్రావం జరుగుతుంది. పాము కాటేసిన భాగాన్ని ఎక్కువగా కదిలించరాదు. ఆ భాగాన్ని బట్టతో లేదా టవాల్‌తో గట్టిగా కట్టాలి. ఇలా చేయడం వల్ల విషం శరీరంలోకి వ్యాపించదు. కట్టును 10 నిమిషాలకు ఒకసారి వదిలి మళ్లీ కడుతూ ఉండాలి. పాము కాటువేసిన చోట కొత్త బ్లేడ్‌తో ప్లస్ గుర్తు మాదిరి ఒక సెంటీమీటర్ లోపలి వరకు కోయాలి. కాసేపటికి విషంతో కూడిన రక్తం దానంతట అదే బయటకు పోతుంది. సాధ్యమైనంత త్వరగా సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్తే వైద్యుడు స్నేక్ వినం చికిత్స తో ప్రాణపాయం తప్పుతుంది. రాత్రి వేళలో పొలం వద్దకు వెళ్లే రైతులు శబ్దం చేస్తూ, టార్చ్ లైట్ ను వెంట తీసుకువెళ్లాలి.

## పురుగు మందులతో జాగ్రత్త....

పంట పొలాలలో మందులు పిచికారి చేసే సమయంలో రైతులు సరైన జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదాలు తప్పవు. ఎరువులు, క్రిమి సంహారక మందులు పిచికారి చేసేటప్పుడు అజాగ్రత్తగా ఉండడం వల్ల రైతులు అస్వస్థతకు గురై ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. పురుగు మందుల పిచికారి చేసేటప్పుడు చేతులకు బ్లౌజులు, కాళ్లకు రబ్బర్ బూట్లు, ముక్కుకు గుడ్డలను ధరించాలి. పిచికారి మందులను గ్లౌజ్ వేసుకున్న చేతితో లేదా కర్ర సహాయంతో కలుపుకోవాలి. పురుగుమందులు, ఎరువులు మందులు, పిచికారి చల్లడం అయిపోయిన వెంటనే చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. ఇంటికి వెళ్ళగానే స్నానం చేసిన తర్వాతనే భోజనం చేయాలి. పురుగు మందులు, ఎరువుల డబ్బలను డిటర్జెంట్‌తో శుభ్రం చేసుకోవాలి అని వ్యవసాయ అధికారులు అన్నారు.



# ఎరువుల కొరత లేకుండా చూస్తాం

### రాష్ట్ర పాడి పశుసంవర్తక శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి

**ఆత్మకూర్ ఆగస్టు 17, ప్రభాతవార్త;** ప్రస్తుత వర్షాకాలానికి సంబంధించిన ఖరీఫ్ సీజన్ కి గాను రాష్ట్రంలో ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పాడి పశుసంవర్తక శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి వెల్లడించారు. ఆదివారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ఆత్మకూరు మార్కెట్ కమిటీ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన వరినట్లు ఒకేసారి పూర్తి కావడంతో రైతులు ఒక్కసారిగా ఎరువులు , యూరియా కోసం ఎగబడుతున్న విషయం ప్రభుత్వం గుర్తించిందని ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచి సరఫరా చేసేందుకు అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లుగా ఆయన తెలిపారు. రాష్ట్రంలో అక్కడక్కడ యూరియా కొరత ఉన్నప్పటికీ సంబంధిత జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లుగా మంత్రి వాకిడి శ్రీహరి తెలిపారు. ఖరీఫ్ సీజన్లో ఒకసారిగా వ్యవసాయ సాగు పెరగడం సరైన సమయానికి కేంద్ర ప్రభుత్వం నుండి యూరియా అందకపోవడంతో అక్కడక్కడ ఉన్న ఇబ్బందులను అధిగమించేందుకు తాము చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రియదర్శి జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువకు గత వారం రోజుల క్రితం నీటి విడుదల నిలిపివేయడంతో ఆయకట్టు రైతులు ఆదివారం రాష్ట్ర మంత్రిని కలిసి తక్షణమే నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయడంతో రాష్ట్ర మంత్రి వాకిడి శ్రీహరి ఎక్కడినుండే సంబంధిత ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు అధికారులతో ఫోన్లో చర్చించి నీటిని విడుదల చేయించారు. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కొరవడంతో నీటిని నిలిపివేసిన విషయాన్ని అధికారులు రాష్ట్రమంత్రికి వివరించారు . ఈ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా, ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ ,మక్తల్ నియోజకవర్గం మాజీ అధ్యక్షులు తులసి రాజు యాదవ్ ,ఆత్మకూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు, తదితరులతో పాటుగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆత్మకూరులోని మార్కెట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి,ఎమ్మెల్యే

# అధ్యాపకుల కొరతను తీర్చండి

### మహబూబ్‌గర్ ఎంపీ డీకే అరుణకు

### వినతి ఎంపీని కలిసిన కేంద్రీయ విద్యాలయం తల్లిదండ్రులు

**మహబూబ్‌నగర్ ఆగస్టు 17, ప్రభాతవార్త:** మహబూబ్‌గర్ జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని మహబూబ్‌గర్ ఎంపీ డీకే అరుణకు వినతి పత్రం అందజేశారు. విద్యాలయంలో మొత్తం 32 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా 15 మంది రెగ్యులర్ ఉపాధ్యాయులతో పాటు, 17 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తు న్నారని వినతిలో పేర్కొన్నారు. కాంట్రాక్టు ఉపాధ్యాయులు కాకుండా రెగ్యులర్ వారిని నియమిస్తే విద్యార్థులకు చదువు బాగా చెబుతారని పేర్కొ న్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో వెంకట్ రెడ్డి, రఘురాంరెడ్డి,ఎస్ అశోక్ గౌడ్, కరుణాకర్ రెడ్డి , శ్రీనివాసరెడ్డి, గోపి , రమేష్ చారి వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.



ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

# గిరిజనుల తీజ్ ఉత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత

### - ఘనంగా గిరిజనుల తీజ్ ఉత్సవాలు.. - ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, ఆగస్టు 17 ప్రభాతవార్త:** గిరిజనులు తీజ్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పేర్కొన్నారు. గిరిజన సోదరులు శ్రావణ మాసంలో నిర్వహించే తీజ్ పండుగకు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని ఆయన తెలిపారు. కల్వకుర్తి మున్సిపాలిటిలోని భగత్‌సింగ్ తండాలో గిరిజన మహిళలు ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో తీజ్ ఉత్సవాలు మొలకల పండుగలు నిర్వహించుకునే అనవాయితీలో భాగంగా ఆదివారం నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు వారి తండాల్లో వివాహం కానీ పిల్లల కోసం 9 రోజుల పాటు మొలకలను పండుగను నిర్వహిస్తారని, 9వ రోజు భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షను చేపట్టి మొలకలను తలపై పెట్టుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించడం ఆనవాయితీ అని అన్నారు. గిరిజన యువతులతో పాటు ఎమ్మెల్యే మొలకలను తలపై పెట్టుకొని తీజ్ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీజ్ ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్‌తో పాటు పలువురిని గిరిజన సోదరులు వారి సంప్రదాయబద్ధంగా సన్మానించారు. గిరిజన సోదరులతో ఎమ్మెల్యే కొద్దిసేపు ఊయ్యాల ఊగి అందరిని ఆనందింపజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు హన్మనాయక్, గోరటి శ్రీనివాసులు, హరిప్రసాద్, చంద్రకాంత్‌రెడ్డి, కార్యకర్తలు, గిరిజన నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పలువురు నేతలు

# వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

### చిన్నపిల్లలను నిమజ్జనానికి తీసుకెళ్లరాదు

### విద్యుత్, మున్సిపల్, రెవెన్యూ శాఖ అప్రమత్తంగా ఉండాలి

### హన్వాడ, చిన్నదర్పల్లి లో చెరువులను పరిశీలించిన ఎస్పీ జానకి

**మహబూబ్‌గర్ బ్యూరో ఆగస్టు 17, ప్రభాతవార్త:** వినాయక చవితి సందర్భంగా నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, భద్రతా పరంగా జరుగుటకు జిల్లా పోలీస్ విభాగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో ఆదివారం ఎస్పీ జానకి

- మిగతా3లో..



చెరువులను పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

# పేదోడి ఆత్మగౌరవ ప్రతీక రేషన్ కార్డు

### - అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**వంగూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త: బడుగు,** బలహీన వర్గాల ప్రజలకు రేషన్ కార్డులను అందించి రేషన్ షాపులలో సన్నబియ్యాన్ని సరఫరా చేసి 3 పూటల భోజనాన్ని అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి అర్హత కలిగిన పౌరులకు రేషన్ కార్డు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం వంగూరు మండలం వెంకటాపూర్, మాచినోనిపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య ఆతితిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ మాట తప్పని మడిమతిప్పని ప్రభుత్వమని పేద ప్రజల ఆత్మవిశ్వాసంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పేదోడి ఆత్మగౌరవ ప్రతీక కొత్త రేషన్ కార్డులని, సన్నబియ్యం, రైతుకు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ కల్పించి రైతన్నకు ఆసరాగా నిలిచిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఆయన గుర్తు చేశారు. ఆడబిడ్డలకు ఆర్టీసీలో ప్రయాణాన్ని ఉచితంగా అందించామని, పేదల ఇండ్లకు ఉచిత కరెంటును అందించి, లెక్కకు మిక్కిలిగా సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అది ఇందిరమ్మ రాజ్యంలో మాత్రమే సాధ్యమని, మరోసారి రుజువు చేశామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల కోసం ప్రత్యేకంగా వడ్డీలేని రుణాలను అందిస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయటమే తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రుణాలను తీసుకున్నవారికి నచ్చినా విధంగా ఎవ్వరి కాలమీద వారు కష్టపడి నిజాయితీగా వ్యాపారం చేసుకుంటూ వారి కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ప్రభుత్వం మహిళ సంఘాలకు వడ్డీలేని రుణాలు, సంఘంలో ఉన్న సభ్యురాలు ప్రమాదవశాత్తు చనిపోతే ప్రమాద బీమా వర్తిస్తుందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ పవర్ ప్లాంట్లను, పెట్రోల్ బంకులను, పాఠశాల యూనిఫాం స్టిచ్చింగ్, కోళ్ల పెంపకం, పాల డైరీల ఏర్పాటుకు మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రోత్సహిస్తామని అన్నారు. వెనుకబడిన మహిళలకు చేయుతగా ఉచిత ఆర్టీసీ ప్రయాణంలో పాటు ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిట మంజూరు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాదమోని రమేష్ గౌడ్, సీనియర్ నాయకులు అల్వాల్ రెడ్డి, హరీష్ రెడ్డి, తిరుపతి రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, శంకర్, జనార్ధన్, గఫూర్, ప్రజా ప్రతినిధులు, మండల పార్టీ నాయకులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అర్హులకు రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే

# పారుతున్న అలుగుతో ఆనందంలో రైతులు

### పేట కొండరెడ్డి పల్లి చెరువును సందర్శించిన మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం

**నారాయణపేట టౌన్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** నారాయణపేట కొండరెడ్డిపల్లి చెరువును అలుగు పారుతుందన్నా విషయం తెలుసుకున్న మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్‌తో బాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం నీటితో కళకళలాడుతున్న చెరువును సందర్శించి పరిశీలించారు. చెరువుకు ఇరువైపులా గుట్టలు, పక్కనే కోట బురుజు, రెండు అడుగుల ద్వారా పారుతున్న నీటి దృశ్యాలు ఆకర్షనీయంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోని చెరువు నిండి రైతులకు పుష్కలంగా నీరు అందాలని, భూగర్భ జలాలు పెరగాలన్నారు. ఈ దృశ్యాన్ని తిలకించేందుకు నారాయణపేట పట్టణ ప్రజలు యువకులు, మహిళలు ఇతర గ్రామాల ప్రజలు పారుతున్న అలుగు దగ్గర ఫోటోలు సెల్ఫీలు దిగుతూ ఆనందంగా కాలక్షేపం చేస్తున్నారు. పారుతున్న అలుగుతో ఆయకట్టు ధరలు సంతోషంగా ఉన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు తదితరులు ఉన్నారు.



చెరువును పరిశీలిస్తున్న మాజీ డిసీసీ అధ్యక్షులు , మార్కెట్ కమిటీ చైర్మన్

# అర్ధరాత్రి అయినా యూరియా ఇవ్వాల్సిందే

### మక్తల్ మండలానికి

### కన్నా నర్వకు అధికంగా

### యూరియా సరఫరా చేసాం

### రైతులను ఇబ్బందులు

### పెడితే ఊరుకునేది లేదు

### తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి

**నర్వ ఆగస్టు 17, ప్రభాతవార్త :** వివిధ గ్రామాల నుండి యూరియా కోసం ప్రాథమిక సహకార కేంద్రానికి వచ్చిన ప్రతి రైతుకు అర్ధ రాత్రి అయినా సరే యూరియాను ఇవ్వవలసిందేనని క్రీడలు,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సహకార సంఘం సిబ్బందిని ఆదేశించారు.ఆదివారం నర్వ మండల కేంద్రంలోని సహకార సంఘానికి యూరియా కోసం సొసైటీ ముందు గుమ్మిగుడి బాలు తీరిన రైతులను గమనించిన మంత్రి యూరియా పంపిణీ పరిశీలించారు. మక్తల్ నియోజకవర్గంలో ఏడు మండలాల కంటే నర్వ మండలానికి 20 యూరియాను అధికంగా కేటాయించడం జరిగిందని,యూరియాను స్టాక్ ఉంచుకొని రైతులకు పంపిణీ విషయంలో రైతులను ఎందుకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.యూరియా పంపిణీ చేసిన స్టాక్ రిజిస్టర్ ను,నిలువ ఉన్న యూరియాను పరిశీలించారు. యూరియా పంపిణీ విషయంలో సిబ్బంది ఇబ్బందులు పెడుతున్నారని రైతులు మంత్రి దృష్టికి తీసుకురావడం జరిగింది. యూరియా స్టాక్ ఉన్న,సరిపడా స్టాఫ్ ఉన్న పంపిణీ విషయంలో ఎందుకు నిరక్ష్యం చేస్తున్నారని సిబ్బందిని నిలదీశారు.సిబ్బందికి శివ వర్ధన్ రెడ్డికి సంబంధించిన లంకాల గ్రామానికి చెందిన అనుగొండ శ్రీనివాస్ రెడ్డి కి సంబంధించిన ఎలాంటి డీటెయిల్స్ ఆన్లైన్ లో నమోదుచేయకుండా,ఓటిపి తీసుకోకుండా 20 సంచుల యూరియాను ఇవ్వడంతో రైతులు సిబ్బందిని నిలదీశారు.ఉదయం నుంచి కూర్చున్న మాకు ఇవ్వకుండా ఎలాంటి పుస్తకాలు ఆధార్ కార్డు లేకుండా యూరియా ఎలా ఇచ్చారని సిబ్బందిని నిలదీశారు.ఈ విషయాన్ని రైతులు మంత్రి దృష్టికి తీసుకురాగా మంత్రి సిబ్బందిని బయటకు పిలిపించి లైన్లో ఉన్న వారికి కాకుండా ఆ ఆయనకు యూరియా ఎందుకు ఇచ్చారని,బంధువులకు చుట్టాలకు యూరియా ఇవ్వడమేంటని ప్రశ్నించారు. అలాంటి పొరపాట్లను జరగకుండా చూసి లైన్లో నిల్చున్న ప్రతి రైతుకు యూరియాను అందించే వరకు ఎవరు కూడా ఇళ్లకు వెళ్ళవద్దని సిబ్బందిని ఆదేశించారు.ఈ విషయంలో సీఈవో ఉదయ్ కుమార్ వద్ద మంత్రి ఫోన్లో మాట్లాడుతూ ఇంతమంది రైతులు సొసైటీ వద్ద యూరియా కోసం నిలబడి ఇబ్బందులు పడుతూ గంధర్ల గోళం జరుగుతున్న కార్యాలయానికి రాకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఉదయ్ కుమార్ జనరల్ హాలిడే కావడంతో రాలేదని మంత్రికి చెప్పడంతో ఆగ్రహించిన మంత్రి అందరూ కలెక్టర్లు,అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు ముఖ్యమంత్రి సైతం వర్షాలకు లెక్కచేయకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేస్తుంటే మీకు మాత్రం హాలిడేనా అని సీఈఓ ఉదయ్ కుమార్ ను నిలదీశారు. ఏది ఏమైనా లైన్లో నిల్చున్న ప్రతి ఒక్కరికి బిరియాని అందించిన తర్వాతే సిబ్బంది వెళ్లిపోవాలని ఆదేశించారు.వచ్చిన రైతులకు యూరియాను పంపిణి చేసేంత వరకు సహకార సంఘం వద్దనే ఉండి పంపిణీ చేయించాలని కాంగ్రెస్ పార్టీ నర్వ మండల అధ్యక్షుడు చెన్నయ్య సాగర్ కి చెప్పి మంత్రి వెళ్ళిపోయారు.



యూరియా పంపిణీని పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి

## హామీలు అమలు చేయకపోతే ఆందోళన చేపడుతాం

**ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్**

**అమరచింత ఆగస్టు 17,ప్రభాతవార్త :** అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలో డిగ్రీ, జూనియర్ కాలేజ్ నిర్మించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.డి కుతుబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన అమరచింత మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అమరచింతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అమరచింతకు జూనియర్ కళాశాల మంజూరు చేయిస్తానని మాట ఇచ్చిన సంగతి గుర్తు చేశారు. ఈ అకాడమిక్ ఇయర్ లో తరగతులు ప్రారంభిస్తామని ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదని ఆరోపించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇండోర్ స్టేడియం, మినీ స్టేడియం నిర్మిస్తానని అందుకోసం నిధులు కేటాయిస్తానని చెప్పిన మంత్రి ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదన్నారు. ఇక్కడ కనీస వసతులు లేక విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారని ఇప్పటికైనా మంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని లేని పక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు అనురాగ్, విజయ్, నసీర్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎండి కుతుబ్

## బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**మక్తల్ టౌన్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమం పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం మక్తల్ మండలం పంచదేవ్ పాడ్ గ్రామంలో ఆదివారము నూతన బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికిహాజరై మాజీ శాసనసభ్యులు చిట్టెం రాంమోహన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి నిర్వాహకులు శాలువలతోపూలమాలతో సన్మానించి తీర్థ ప్రసాదలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి నరసింహ గౌడ్, ఆ గ్రామ మాజీ సర్పంచులు, ఆంజనేయులు గౌడ్ ,లింగప్ప మాజీ ఎంపిటిసి రాము, టిఆర్ఎస్ పార్టీ నాయకులు చిన్న హనుమంతు, జుట్ల శంకర్ ,నరసింహారెడ్డి , నర్సింలు ,గ్రామస్తులు ఆంజనేయులు, బాలప్ప కుర్వ సాయిబాబు,అన్న బాలరాజు సాయిబన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి

## ఉరి వేసుకొని వ్యక్తి మృతి

**వెల్దండ, ఆగస్టు 17 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పంకజ్ కుమార్(35) అద్దెకు ఉంటున్న ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలకు వెళితే. చారగొండ మండలం జేపల్లి గ్రామానికి చెందిన రాత్లావత్ జయేందర్ మండల కేంద్రంలో కొత్త ఇంటిని నిర్మించుకుంటున్నాడు. ఆ ఇంటి నిర్మాణ పనుల నిమిత్తం మేస్త్రి అవసరం ఉండడంతో తన సోదరునికి తెలియజేయడంతో యూపీకి చెందిన పంకజ్ కుమార్, రాజ్‌కుమార్, రోషన్‌లను పంపగా ఆ ఇంటి నిర్మాణ పనులు పూర్తి అయిపోయిన వెంటనే రాజ్‌కుమార్, రోషన్‌లు వెళ్ళిపోగా పంకజ్‌కుమార్ ఇక్కడే ఉండి మరో ఇంటి నిర్మాణ పనులు చూపించాలని జయేందర్‌ను అడగగా దొంగల గట్టు తండాలో రాత్లావత్ శ్రీను దగ్గరపని చూపించి అడ్వాన్స్‌గా రూ.8వేల తీసుకొని హైదరాబాదు వెళ్లి తిరిగి రెండు రోజుల క్రితం తిరిగివచ్చి పనిచేయక పోతే వారు కొడుతారని చెప్పగా శనివారం రాత్రి తాను అద్దెకుంటున్న ఈదులపల్లి శ్రీను ఇంటిలో పడుకోమని చెప్పగా రాత్రి 9 గంటలకు ఇంట్లోకి వెళ్లి పడుకున్నాడు. తిరిగి మరసటి రోజు ఆదివారం ఉదయం పిలిచినా ఎంతకు పలకకపోవడంతో ఇనుప రాడుతో డోరును తీయగా స్లాబ్‌కు ఉన్న ఒక ఇనుప కొండికి పంకజ్‌కుమార్ ఉరివేసుకొని మృతి చెందినట్లు గుర్తించారు. ఇదివరకు ఎప్పుడు కుటుంబ సమస్యల గురించి చర్చించలేదని జలంధర్ ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

## ముఖ్యమంత్రితో చర్చించి పరిహారం ఎక్కువ ఇప్పించేలా కృషి చేస్తా

**మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి**

**నారాయణపేట టౌన్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ముఖ్యమంత్రితో చర్చించి నష్టపరిహారం ఎక్కువ ఇప్పించేలా కృషి చేస్తానని మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం కానుకుర్తి గ్రామంలో కొనసాగుతున్న రిలే దీక్ష ను సందర్శించారు. గ్రామ పెద్దలతో, రిలే దీక్ష నిర్వాహకులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రితో చర్చించి నష్ట పరిహారం ఎక్కువ ఇప్పిచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భూములను ఇస్తున్న రైతులకు కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎన్నో ఏళ్ల కలగా ఉన్న నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పూర్తి అయి సాగునీరు అంది ఈ ప్రాంతం సస్యశ్యామలంఅవుతుందన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం 14 లక్షలు కన్నా ఎక్కువ వచ్చిన ఎంత ఎక్కువ వస్తే అంత వారికి కూడా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు తో పాటు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కుంభం శివకుమార్ రెడ్డి

## ప్రమాదకరంగా మూలమలుపు

**సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని ప్రయాణికుల విజ్ఞప్తి**

**పెబ్బేర్, ఆగస్టు 17 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలంలోని బునియాదిపురం నుంచి సుగురురోడ్డులో గల మధ్యలో చెరువు దగ్గర ప్రమాదకరంగా ములమలుపు ఉంది. దీనికి ఆర్‌అండ్‌బి వారు సూచిక బోర్డు ఏర్పాటు చేయనందున వాహనదారులకు ఇబ్బంది కరంగా ఉందని వాహనదారులు పేర్కొంటున్నారు. ఈ రోడ్డు మార్గాన రోజు వందల వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయని, ఇప్పటివరకు ఎన్నో ప్రమాదాలు జరిగాయని అధికారులు ములమలుపుల దగ్గర సూచిక బోర్డు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సూచిక బోర్డు లేనందున ఈ రహదారిలో సూగురులో ప్రభుత్వ సీఎంఆర్ రైస్ గోదాం ఉన్నందున భారీ వాహనాలు పోతుంటాయని, వాహనదారులు దగ్గరకొచ్చే వరకు కూడా రోడ్డు సరిగా కనిపించకపోవడంతో ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రయాణీకులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూలమలుపులు ఎక్కడైతే ఉన్నాయో అక్కడ తప్పనిసరిగా సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని వాహన దారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సూచిక బోర్డు లేని ప్రమాదకరంగా మూలమలుపు

## గాంధీ విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలి

- ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సీఐకు వినతి..
- ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ

**కల్వకుర్తి, ఆగస్టు 17 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని పాత మున్సిపాలిటి కార్యాలయ ఆవరణలో గల జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ ఆనరగహం వ్యక్తం చేశారు. ఆదివారం సమాచారం తెలుసుకున్న ఆర్యవైశ్య మహాసభ నాయకులు సంఘటనా స్థలానికి చేరుకొని విగ్రహం ధ్వంసమైన తీరును పరిశీలించి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బచ్చు రామకృష్ణ మాట్లాడుతూ అహింస సిద్ధాంతంతో దేశానికి స్వాతంత్రం తీసుకు రావడంలో అగ్ర భాగాన నిలిచి దేశ ప్రజలందరిని ఏకం చేసి బ్రిటిష్ వారిని వెళ్లగొట్టిన జాతిపిత విగ్రహాన్ని ధ్వంసం చేయడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సిఐ నాగార్జునకు వినతిపత్రం అందించారు. ఆర్యవైశ్య సంఘాల నాయకులు చేసే ఆందోళనకు గాంధీ విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, వెల్దండ మాజీ సర్పంచ్ యెన్నం భూపతి రెడ్డిలు మద్దతు తెలిపి ఆర్యవైశ్యులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ జూలూరు రమేష్ బాబు, పట్టణ సంఘం అధ్యక్షుడు వాసా శేఖర్, మండల శాఖ అధ్యక్షుడు గంధం ప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గంప శ్రీనివాస్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, నాయకులు సంబు ముత్యాలు, కొండూరు కృష్ణయ్య, గంప వెంకటేష్, గందే రవి, శివ, శ్రీనివాస్, కలిమిచెర్ల గోపాల్, జూలూరు వీరేష్, రామ్మోహన్, గుబ్బ కిషన్, సంబూ తరుణ్, గుబ్బ ప్రభాకర్, బచ్చు రఘు, కంది ప్రవీణ్, కల్వ ఆంజనేయులు తదితరులతోపాటు పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్యులు ఉన్నారు.



సీఐ నాగర్జునకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ,మహాసభ నేతలు, నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న బచ్చు రామకృష్ణ

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు..

- కోలాహలంగా శ్రీ గెల్వాలాంబ మాత ఆలయ సన్నిధి...
- అలరించిన చిన్నారుల వేషధారణ

**వంగూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త:** శ్రీశ్రీశ్రీ గెల్వాలాంబ మాత బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకలను ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాదవులచే శ్రీ కృష్ణ బలరాముల వేషధారణ చేయించి ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ నకినమోని శేఖర్ ముదిరాజ్ ప్రారంభించారు. చిన్నారి బాలబాలికలచే శ్రీకృష్ణ గోపిక వేషధారణ చేయించి ఆలయ ప్రాంగణంలోకి తీసుకురావడంతో చిన్నారుల వేషధారణ భక్తులను కనువిందు పరిచింది. చిన్నారి బాలబాలికలు శ్రీకృష్ణ గోపిక వేషధారణ చేసిన వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఆలయ సిబ్బంది న్యాయ నిర్ణయితలుగా వ్యవహరించి ఎంపిక చేసి అందించారు. అనంతరం పెద్ద మంగళహారతితో అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జువ్వ కృష్ణయ్య, వెంకటస్వామి, రమేష్ గౌడ్, నరేందర్ గౌడ్, ఎల్లా గౌడ్, సుమన్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ కృష్ణుడు, గోపికల వేషాధారణలో చిన్నారులు



ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్, అర్చకులు



ఉట్లు కొడుతున్న దృశ్యం

## ఘనంగా బీరప్ప బోనాలు

**పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**



బోనాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**వెల్దండ, ఆగస్టు 17 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బీరప్ప బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ అనాటి నుండి వస్తున్న సాంస్కృతి సంప్రదాయాలను కాపాడుకొని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. భక్తి ద్వారానే ముక్తి లభిస్తుందని అన్నారు. కురుమ సంఘం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి విజితారెడ్డి, మాజీ సర్పంచ్ చిందం లక్ష్మికృష్ణయ్య, మాజీ ఎంపిటిసి లలితాతాంబాలుయాదవ్, జంగిలి నిరంజన్, యాదగిరి, కృష్ణ, రామకృష్ణ, తిరుపతయ్య, వెంకటయ్య, మల్లయ్య, జంగయ్య, శ్రీశైలం, కుమార్, ఆనంద్, రాజు, శ్రీను, సైదులు తోపాటు తదితరులు ఉన్నారు.

## పెళ్లి రిసెప్షన్‌లో మున్సిపల్ మాజీ చైర్మన్



రిసెప్షన్‌లో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్

**భూత్పూర్, ఆగస్టు 17,ప్రభాతవార్త :** భూత్పూర్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు సత్తూర్ సత్యయ్యగౌడ్ కుమారుడు రామకృష్ణ-అనుప్రియల పెళ్లి రిసెప్షన్ ఆదివారం భూత్పూర్ పట్టణ కేంద్రంలోని ఏపీఎన్ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్ గౌడ్‌తో పాటు నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, టి మురళిధర్‌గౌడ్, కొత్తమొల్గర నర్సింహులుగౌడ్, సత్తూర్ అశోక్‌గౌడ్, మొహ్మద్ సాధిక్, నర్సింహులుతో పాటు బీజేపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, హరినాథ్‌గౌడ్, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి అబుబాకర్ సిద్ధిఖి ఇతర నాయకులు పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దుకై మహా ధర్నా పోస్టల్ విడుదల

**అయిజ ఆగస్టు 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఎం ఆర్ సి కార్యాలయం సమీపంలో ఆదివారం పి ఆర్ టి యు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సిపిఎస్ రద్దుకై మహ ధర్నా పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద ఉపాధ్యాయ సంఘమైన పిఆర్టియు టీఎస్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్ లో నీ ఇంద్ర పార్కు సమీపంలో మహా ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఎజెండాలో సిపిఎస్ రద్దు అనే హామీ ఇచ్చిందని కాబట్టి ఆ వాగ్దానం నిలబెట్టుకొని సిపిఎస్ ను తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని సిపిఎస్ అనేది భద్రత లేని విధానమని అందుకే ఉద్యోగుల భవిష్యత్తు రక్షణ కోసం సిపిఎస్ రద్దు తప్పనిసరి అని తెలిపారు. మహా ధర్నా కంటే ముందుగా ఈనెల 27న స్థానిక ఎమ్మెల్యేలకు ఉపాధ్యాయ సంఘం తరఫున వినతిపత్రం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే 28న జిల్లా కేంద్రాల్లో కొవ్వొత్తుల ర్యాలీ 29న బైక్ ర్యాలీ నిర్వహించి సెప్టెంబర్ 1న ధర్నాకు హాజరవుతున్నట్లు తెలిపారు. ధర్నాలో పాల్గొనేవారు పురుషులు నల్ల చొక్కా లేదా టీ షర్టు మహిళలు నల్ల చీర లేద నల్ల చుడిదార్ ధరించాలని తెలిపారు. ప్రతి సిపిఎస్ ఉద్యోగి తప్పనిసరిగా మహాధర్నకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. పోస్టర్ విడుదలచేసిన వారిలో పచ్చర్ల తిమ్మారెడ్డి జిల్లా అధ్యక్షులు బియ్యం వేణుగోపాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అయిజ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్ శివశంకర్‌రెడ్డి, కే బాలకృష్ణ , రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఏబెల్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు ఎం రవి ,సర్వే చారి,బసన్న, భద్రయ్య ,సత్యనారాయణ, రామానాయుడు ,సత్యం ,వెంకటేశ్వర్లు, చాంద్ భాషా, వెంకటేష్, శివకుమార్, లక్ష్మి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





పోస్టర్ను విడుదల చేస్తున్న దృశ్యం

## గణేష్ ప్రతిష్టాపనలో వేద పండితుల సూచనలు పాటిద్దాం

**విశ్వహిందూ పరిషత్ నారాయణపేట జిల్లా**

**నారాయణపేట టౌన్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** వేద పండితులు సూచించిన సమయం ప్రకారం గణేష్ ను ప్రతిష్టాపన పూర్తి చేసుకోవాలని విశ్వహిందూ పరిషత్ నారాయణపేట జిల్లా శాఖ సూచించారు. ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ మరియు నగర ఉత్సావ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వేద పండితుల సూచించిన ప్రకారం గణేష్ ప్రతిష్టాపన ఈ నెల 27.08.2025 ఉదయం 6 గంటల నుండి 9 గం.ల వరకు, 10 గంటల నుండి 12.30 నిమిషాల వరకు సాయంత్రం 6 గంటల నుండి 9 గంటల వరకు ప్రతిష్టాపన పూర్తి చేయాలన్నారు. నిమజ్జనోత్సవం 5.09.2025 నాడు రాత్రి 9 గంటల నుండి ప్రారంభించాలన్నారు.

## విద్యార్థులు మొబైల్‌ను విడిచి ఆటల మైదానం వైపు రావాలి

**బావసార క్షత్రియ రాష్ట్ర అధ్యక్షులు ఉమేష్ కుమార్ జైత్రాన**

**నారాయణపేట టౌన్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** పాఠశాల కళాశాలల విద్యార్థిని విద్యార్థులు మొబైల్ ఫోన్ లను విడిచి ఆటల మైదానం వైపు రావాలని భవసార క్షత్రియ రాష్ట్ర అధ్యక్షులు ఉమేష్ కుమార్ జైత్రానే అన్నారు. ఆదివారం సరాఫ్ బజార్ వీధిలోని దత్తాత్రేయ మందిరం లో భవసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు విద్యా సదస్సుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ నేటి సమాజంలో చదువుకునే వారు పుస్తకాలను పక్కనపెట్టి మొబైల్ ఫోన్ లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని దీనిని పక్కనపెట్టి విద్యార్థిని విద్యార్థులు ఆట పాటలలో సైతం రాణించాలని ఆయన పిలుపునిచ్చారు. నేటి సమాజంలో చదువుకునే విద్యార్థులతో పోటీపడి చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఆయన సూచించారు. చదువుల తల్లి సరస్వతి దేవిని పూజిస్తే చదువుల తల్లితో పాటు లక్ష్మీదేవి ఆశీర్వాదం ఇస్తుందని అప్పుడే చదువుతోపాటు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని ఆయన విద్యార్థులకు సూచించారు. అంతేకాక ప్రపంచంలోనే హిందూ సంప్రదాయం చాలా గొప్పదని హిందూ సంప్రదాయానికి ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని ఆయన అన్నారు. చదువుతోపాటు నేటి సమాజంలో జరుగుతున్న మంచి చెడు అంశాలపై ఆయన విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు లోకండే శ్రీధర్, కిషోర్ తాండ్లే, వసంత్ కుమార్, బానూద్కర్, నారాయణపేట బావ సార క్షత్రియ సమాజ్ అధ్యక్షులు తెల్కర్ విజయ్ కుమార్, సెక్రెటరీ రమేష్ నింకార్, శ్రీనివాస్, క్షీరసాగర్, పతంగే లక్ష్మణ్, గణతే సురేష్, గణతే అంబదాస్, ఘనతే చెన్నప్ప, గణతే భరత్ కుమార్, పతంగే ఆనంద్ కుమార్ తో బాటు తదితరులు ఉన్నారు.



విద్యా సదస్సు పై అవగాహన సదస్సు

## బిఎస్పీ బలోపేతానికి కృషి



బీఎస్పీ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు

**కొల్లాపూర్ ఆగస్టు 17, ప్రభాతవార్త:** బిఎస్పి రాష్ట్ర నాయకులు పృథ్వీరాజ్. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఎస్పి పార్టీని బలోపేతం చేస్తామని బీఎస్పీ ఈసీ మెంబర్ పృథ్వీరాజ్, జిల్లా ఇంచార్జ్ కళ్యాణ్ అన్నారు. ఆదివారం కొల్లాపూర్ పార్టీ కార్యాలయం లో తాలూకా అధ్యక్షులు బొల్లి కురుమయ్య అధ్యక్షతన నిర్వహించిన అసెంబ్లీ సమీక్ష సమావేశంలో వారు మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ సత్తా చాటాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వరకూ పార్టీ కమిటీలను పూర్తిచేసి పార్టీని బలోపేతం చేయాలనీ పిలుపునిచ్చారు. గ్రామ, మండల, అసెంబ్లీ కమిటీల మీటింగ్స్ ఎప్పటికప్పుడు నిర్వహించాలని కోరారు. పని చేసే వారినీ ప్రోత్సహిస్తూ, నూతన నాయకత్వాన్ని పార్టీ కమిటీల్లోకి తీసుకోవాలని తెలిపారు. గత ఎన్నికల్లో కొల్లాపూర్ అసెంబ్లీ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ నుండి వార్డ్ మెంబర్లు గెలిచారని, ఇప్పుడు కూడా మరోసారి గెలుపు దిశగా పయనిద్దామని అనీ అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ జిల్లా కోశాధికారి దాస్, కొల్లాపూర్ అసెంబ్లీ కార్యదర్శి జై భీం శంకర్, సీనియర్ నాయకులు విధాత, నాయకులు మధు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గద్దర్ రెండవ వర్ధంతిని విజయవంతం చేయండి

**వర్ధంతి సభ నిర్వాహకులు బూర్గుల మునుస్వామి**

**చిన్నంబావి ఆగస్టు 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బెక్కెం గ్రామంలో ఈనెల 21న నిర్వహించే గద్దర్ వర్ధంతి సభను విజయవంతం చేయాలని రెండవ వర్ధంతి సభ నిర్వాహకులు బూర్గుల మునిస్వామి పిలుపునిచ్చారు. చిన్నంబావి మండల కేంద్రంలో ఈ నెల 21 గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంకాలం 5 గంటల వరకు కళాకారుల ఆటపాట గద్దర్ అన్న యాది సభలో ఉంటుందనీ కనుక చిన్నంబాయి మండలంలో ఉన్నటువంటి వివిధ గ్రామాల కుల సంఘాల నాయకులు, విద్యార్థులు మేధావులు రాజకీయాలకు అతీతంగా తరలిరావాలని కోరుతూ బెక్కెం లో ప్రజలను కలవడం జరిగింది. అందులో భాగంగా కరపత్రం కూడా విడుదల చేయడం జరిగింది. ఇందులో భాగంగా నిర్వాహకులు మునిస్వామి, వడ్డెమాన్ నరసింహ, దేవుని కృష్ణ, అంజి తదిరులు పాల్గొన్నారు.



వర్ధంతి సభను విజయవంతం చేయాలని పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

## వినాయక ఉత్సవాలు

# ప్రశాంతంగా జరుపుకోవాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

చిన్నదరపల్లీ, హన్వాడ చెరువులను స్వయంగా పరిశీలించారు. అలాగే వర్షాల కారణంగా బోయపల్లి, టంకర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా చెరువులు, వాగులు ఉప్పొంగే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, ఆ పరిణామాలను సమీక్షిస్తూ ముంపు ముప్పు ఉన్న గ్రామాల్లో స్థానిక యువకులతో ఎస్పీ ప్రత్యక్షంగా మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిమజ్జనం సమయంలో ప్రజలు శాంతియుతంగా, క్రమపద్ధతిలో పాల్గొనాలన్నారు. మద్యం సేవించి నిమజ్జనానికి రాకూడదని, చిన్నారులను చెరువుల దగ్గరికి అనుమతించరాదన్నారు. భారీ వర్షాల కారణంగా చెరువులు, వాగులు నిండిన కారణంగా అత్యవసర పరిస్థితి తప్ప బయటకు వెళ్లకూడదని సూచించారు. వర్షాల సమయంలో విద్యుత్ తీగలు తెగిపోవడం, చెట్లు పడిపోవడం వంటి ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. పోలీసులు, మున్సిపల్ , రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఎస్పీవెంట మహబూబ్ నగర్ రూరల్ సీఐ గాంధీ నాయక్, హన్వాడ ఎస్ఐ వెంకటేశ్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.


చెరువులను పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

# ఊట్కూర్‌లో గంజాయి స్వాధీనం

**-ఇద్దరు యువకుల అరెస్టు**

**ఊట్కూర్, ఆగస్టు 17 ప్రభాతవార్త:** ఊట్కూర్ శివారులోని అయ్యప్ప స్వామి దేవాలయం పక్కన గల వెంచర్ వద్ద గంజాయి కలిగి ఉన్నారని నమ్మదగిన సమాచారం ఆధారంగా పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించగా పులిమామిడి గ్రామానికి చెందిన అరవింద్‌గా (22), కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్ గ్రామానికి చెందిన కోరెబాన్ సంజీవ్ (23)లుగా పోలీసులు గుర్తించారు. వీరిద్దరి వద్ద నుంచి 125 గ్రాముల గంజాయిను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై యన్.డి.పి.యస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, అరెస్టయిన వారిని కోర్టులో హాజరుపరచినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలను కలిగి ఉండేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.


పోలీసుల అదుపులో యువకులు ( ఇన్‌సెట్లో) స్వాధీనం చేసుకున్న గంజాయి

## భూ నిర్వాసితులకు తగిన నష్టపరిహారం

# ఇవ్వాలని మంత్రికి రైతుల వినతి

**ఊట్కూర్, ఆగస్టు 17 ప్రభాతవార్త :** కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోతున్న రైతులు తమకు తగిన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతులు ఊట్కూర్ మండల కేంద్రంలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర్యప్రకాశ్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్ రెడ్డి, మొట్కూర్ బాల్ రెడ్డి తదితరులు రైతులతో కలిసి పాల్గొన్నారు. రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకు 14 లక్షల పరిహారం సరిపోదని, కనీసం 30 లక్షలు ఎకరాకు చెల్లించాలని, అలాగే భూములు కోల్పోయిన ప్రతి రైతు కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను మంత్రి వాకిటి శ్రీహరి శ్రద్ధగా విని, రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.


రైతులతో మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

# భారతీయ కళలకు జీవం పోద్దాం

## సంస్కార భారతి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని జయంతి

**జడ్చర్ల, ఆగస్టు17, ప్రభాతవార్త :** బాదేపల్లి పట్టణంలో ఆదివారం విద్యానగర్ కాలనీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో సంస్కార భారతి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జయంతి పురస్కరించుకొని సంస్కార భారతి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కార భారతి జిల్లా ఉపాధ్యక్షులు గోనెల రాధాకృష్ణ మాట్లాడుతూ భారతీయ కళలకు జీవం పోస్టు దేశం లో సంస్కార వ్యాప్తికి ప్రతి ఒక్కరు కళాకారుడు కృషి చేయాలని సంస్కార భారతి లలిత కళ కులకు ద్వారా సమాజాన్ని చైతన్య పరుస్తుందన్నారు. విద్యార్థులు తమలో ఉన్న ప్రతిభను వెలికితీస్తూ కార్యక్రమాలను నిర్వహించి కళాభివృద్ధి కోసం తమవంతు కృషి చేస్తున్న జడ్చర్ల సంస్కార భారతిశ్రీకృష్ణుని వేషాధారణ పోటీల్లో అత్యంత ప్రతిభను కనబడుతూ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జిల్లా గోనెల రాధాకృష్ణ, రాజు,విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కృష్ణాష్టమని వేడుకల్లో చిన్నారులు

# ప్రభుత్వ భవనాలపై పట్టింపేది..

- స్లాబ్ లపై నిలుస్తున్న వర్షం నీరు..
- శిథిలావస్థకు చేరుతున్న భవనాలు..
- నీటి ఊటతో ప్రమాదపు అంచున తరగతి గదులు..
- భవనాలపై అధికారుల నిండు నిర్లక్ష్యం..
- లక్షలలో ప్రజాధనం వృధా..

**మాగనూర్ ఆగస్టు 17, ప్రభాతవార్త :** ప్రజాధనం లక్షలలో వెచించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు అధికారుల నిండు నిర్లక్ష్యానికి శిథిల వ్యవస్థకు చేరుతున్నాయి. మాగనూర్ మండలంలోని ప్రజా పరిషత్, రెవెన్యూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాఠశాలల భవనాలతో పాటు మిగతా ప్రభుత్వ భవనాల స్లాబ్ పై వర్షపు నీరు నిలువ ఉండి భవనాలు లైఫ్ టైం కంటే తక్కువ సమయంలోనే పాడైపోయి పెచ్చులు ఊడిపడే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతోనే స్లాబ్ లపై చెత్తచెదారంతో నిండిపోయి నీరు నిలువ ఉంటున్నాయి. ఆఫీసర్లు పనిచేసే కార్యాలయల్లో కొంచెం బాధ్యతగా వ్యవహరించి పంచాయతీ సిబ్బందితో స్లాబులపై ఉన్న చెత్తచెదరని క్లీన్ చేసుకుంటే ప్రభుత్వ భవనాలను కాపాడుకోవచ్చు. కానీ అవేవీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఒక్కరోజు వర్షం వస్తే జలపాతం లాగా చినుకు చినుకు పాఠశాల భవనం నుంచి వర్షపు నీరు కురుస్తున్న ఘటనలు చాలానే ఉన్నాయి. ప్రభుత్వ భవనాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ప్రభుత్వ భవనాలపై ఉన్న చెత్తను తొలగించి, ప్రభుత్వ భవనాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.స్లాబ్ లపై చెత్తను తొలగించండి...మాగనూర్ మండలంలో దాదాపుగా అన్ని శాఖల అధికారులు ప్రభుత్వ భవనాలపై నిరక్ష ్యం వహిస్తున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రభుత్వ భవనాల స్లాబులపై వర్షపు నీరు నిలువ ఉండి కుంటలను తలపిస్తున్నాయి. సంబంధిత అధికారుల నిరక్ష ్యంతోనే ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరి తొందరగా పాడుతున్నాయని ప్రజల నుండి విమర్శలు వస్తున్నాయి. సంవత్సరానికి ఒక్కసారైనా పంచాయతీ సిబ్బందితో స్లాబ్ లపై ఉన్న చెత్తను క్లీన్ చేయిస్తే, వర్షపు నీరు ఆగవని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. స్లాబు ఏటవాలుగా లేకపోవడంతో ఆగిన వర్షపు నీరు పై అధికారులు దృష్టి సారించి ప్రభుత్వ భవనాలను కాపాడాలని ప్రజల కోరుతున్నారు.నీటి ఊటలో తరగతి గది...భారీగా కురిసిన వర్షానికి మాగనూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల నీటిఊట లాగా తయారైంది. స్లాబుపై వర్షపు నీరు కుంటలాగా ఆగుతున్నాయి. ఇంత జరుగుతున్న అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఆ గదిలోనే నిత్యం విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రమాదవశత్తు ఏదైనా జరిగితే తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. కనుక అధికారులు ప్రభుత్వ భవనాలపై నజర్ ఉంచి భవనాలను కాపాడడంతోపాటు, ప్రమాదం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు గుర్తు చేస్తున్నారు.


ఎంపీడీవో కార్యాలయంలో ఓ భవనం


.ప్రాథమిక పాఠశాల భవనం మాగనూర్

### ప్రమాదం జరిగే వరకు పట్టించుకోరా...



వర్షపు నీరుతో ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. మాగనూర్ ప్రాథమిక పాఠశాల భవనం స్లాబుపై వర్షపు నీరు నిలువ ఉండి, ఊట వచ్చి పాకరా పట్టింది. తరగతిగది ప్రమాదం అంచుల్లో ఉంది. ప్రమాదం జరిగే వరకు పట్టించుకోరా? అధికారులు చూసి కూడా పట్టించుకుంటలేరు. ఇప్పటికైనా సంబంధిత ఆఫీసర్లు ప్రభుత్వ భవనాలపై దృష్టి పెట్టి భవనాలను కాపాడండి.

*నయ్యుమ్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు*

### జిల్లాకు సమాచారం ఇచ్చాం...

ఇటీవల కాలంలో జిల్లా నుంచి సమస్యలు ఉన్న తరగతి గదులపై వివరణ కోరారు. రెండు గదులు సమస్యలు ఉన్నాయని చెప్పాను. ఉన్నత అధికారులు స్పందించి స్లాబులపై ఉన్న చెత్తను తొలగించేందుకు చర్యలు చేపట్టి, స్లాబ్ లపై వర్షపు నీరు ఆగకుండా చేస్తే తరగతి గదులకు మేలు జరుగుతుంది.

*రాజిరెడ్డి, హెడ్మాస్టర్ మాగనూర్ ప్రాథమిక పాఠశాల*

# సామాజిక సేవలకు ప్రభుత్వ సహకారం అందిస్తా

**- దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి**

**చిన్నచింతకుంట, ఆగస్టు 17 ప్రభాతవార్త:** సామాజిక సేవయే ధ్యేయంగా పనిచేస్తున్న మజ్లిస్ అహ్మదీయా ముస్లిం జమాత్‌కు ప్రభుత్వపరంగా సహకారం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని అహమ్మదీయ జమాతే - పరిచయం సేవా కార్యక్రమంలో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అహమ్మదీయ ముస్లిం జమాతే ఒక అంతర్జాతీయ మత సామాజిక సంస్థ ద్వారా అనాథలకు, పేదలకు సహాయం, వృద్ధులకు, నిరుపేదలకు ఆర్థిక సహకారం అదేవిధంగా ఆరోగ్య కార్యక్రమాలలో భాగంగా రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలను, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఆహారం, పండ్లు పంపిణీ లాంటి సేవా కార్యక్రమాలతో పాటు విద్యాపరంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ కిట్లు, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తూ కులమతాలకతీతంగా సేవలందించడం ఎంతో అభినందనీయం అన్నారు. ప్రతి ఒకరిని ప్రేమించాలి, ఎవరిని ద్వేషించకూడదు అనే నినాదం ఎంతో స్ఫూర్తినిస్తుందని, ముస్లింలలో కూడా దేశభక్తులు ఉన్నారని కొందరు మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారన్నారు. అన్ని మతాలను గౌరవించే దేశం భారతదేశం అన్నారు. అహమ్మదీయ ముస్లిం జమాతే చేస్తున్న మానవసేవ కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని మంచి పనులు చేయాలని ఆయన ఆకాంక్షించారు. అంతకుముందు జమాతే జిల్లా అధ్యక్షులు అజీమ్ అహ్మద్, వజీర్ అహ్మద్ బాబులు మాట్లాడుతూ అహమ్మదీయ ముస్లిం జమాతే ఎల్లప్పుడూ మానవత్వం, శాంతి, ప్రేమ కోసం పనిచేస్తూ ఏ మతానికి, ఏ వర్గానికి పరిమితం కాకుండా అందరికీ సేవలు చేయడం తమ ధర్మంగా భావిస్తూ ముందుకెళ్తున్నామన్నారు. జమాతే ఐదవ ఖలీఫా హాజరత్ మీర్జా మసూర్ అహ్మద్ నాయకత్వంలో ఆయన మార్గదర్శకంతో ప్రపంచవ్యాప్తంగా అహమ్మదీయ ముస్లిం జమాతే మానవ సేవలో అగ్రగామిగా కొనసాగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమాతే మతపెద్దలు దక్షిణ భారత ఉపాధ్యక్షులు అతుల్ బషీర్ సాబ్, అన్వర్ అహ్మద్, అతుల్ వదూద్, ముజఫర్ అహ్మద్, అబ్దుల్ ఖాదర్, బషారత్, తారీక్ మహమ్మద్, మహమ్మద్ ఉమర్, ఫరూక్ అహ్మద్ వీరితోపాటు పెద్ద సంఖ్యలో చిన్నారులు, అహమ్మదీయ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి


ప్రధాన రహదారి నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

# పొంగిన పోలేపల్లి వాగు..

- నిలిచిన రాకపోకలు..
- ఏటా ఇదే పరిస్థితి..
- ఇకనైనా మారిన దుస్థితి

**జడ్చర్ల, ఆగస్టు 17, ప్రభాతవార్త:** గత మూడు రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. చెరువులు కుంటలు అలుగులు పారడంతో గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. జడ్చర్ల మండల పరిధిలోని పోలేపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో పోలేపల్లి నుంచి కిష్టారం వెళ్ళే దారిలో ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఏటా ఇదే పరిస్థితి నెలకొంటుందని అధికారులు పట్టించుకోవడంలేదని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు ఏర్పాటు చేసి నీళ్ల నిలవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గంగపూజ


విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గంగా పూజ

**నారాయణపేట టౌన్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** నారాయణపేట కొండపల్లి చెరువు నీటితో కళకళలాడుతూ అలుగుపారు తున్న సందర్భంగా ఆదివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో చెరువును సందర్శించి గంగ పూజను చేపట్టారు.అనంతరం పలువురు మాట్లాడుతూ చెరువులు నిండడంతో భూగర్భ జలాలు పెరిగి ప్రజలంతా, రైతులు ఆనందంగా ఉంటారన్నారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులతో పాటు తదితరులు ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, ఆగస్టు 17 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని కుప్పగండ్ల గ్రామానికి చెందిన దుబ్బ కాశయ్య ఇటీవల మృతి చెందారు. అతని కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశం గోపాల్ రెడ్డి పరామర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

## 18న నేడు కలెక్టరేట్ ఎదుట అంగన్వాడి ఉద్యోగుల ధర్నా

**మహబూబ్‌నగర్, ఆగస్టు17, ప్రభాతవార్త:** సీఐటీయూ తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్నామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కవిత ,సరోజ సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పోషన్ ట్రాకర్ యాప్ లో ఫేస్ క్యాప్చర్( ఎఫ్ ఆర్ ఎస్) రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఒకే ఆన్లైన్ యాప్ ఉండేలా వెంటనే నిర్ణయించాలని. అంగన్వాడీ రిపోర్టింగ్ డిజిటలైజేషన్ సిస్టం అమలుకు ముందు అన్ని అంగన్వాడి కేంద్రాల్లో కంప్యూటర్ ల్యాప్టాప్, క్యాబ్ లేదా ఫైవ్ జి నెట్వర్క్ తో కూడిన మొబైల్ ఫోన్లు ఇవ్వాలని, అంగన్వాడి కేంద్రాల్లో ఉచిత వైఫై కనెక్షన్ లేదా డేటాకు తగిన మొత్తం డబ్బులు చెల్లించాలని, సుప్రీంకోర్టు ఆర్డర్ ప్రకారం ఆధార్ ధ్రువీకరించిన ఎఫ్ఆర్ఎస్ తో సంబంధం లేకుండా లబ్ధిదారులందరికీ నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించాలని, దీర్ఘకాలిక డిమాండ్లు కనీస వేతనము, పెన్షన్ ,సామాజిక భద్రత, తదితర డిమాండ్లతో ధర్నా చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని టీచర్లు హెల్పర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

**డాక్యుమెంట్లు పోయినవి**

ఇందుమూలంగా సమస్త ప్రజలకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడ మేమనగా నా క్లైంటులు అన్వార్ వెంకటేష్ మరియు అన్వార్ అశోక్ తండ్రి అన్వార్ లక్ష్మయ్య ఆర్‌వో ఇంటి నెంబర్ : 2-1-49బ్రహ్మన్ వాడి కాలనీ నారాయణపేట గార్ల షాప్ (డోర్ నం. 4-8-67 ) షాప్ యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్ (1324/1985 మరియు 1298/1985)లు , వారి ఇంటి మరమ్మత్తులు చేస్తున్న సమయంలో పోయినవి. కావున ఎవరికైనా దొరికితే క్రింది నా అడ్రస్ కు తెలియజేయగలరు. జి.రఘువీర్ అడ్వకేట్ , హౌస్ నెంబర్ 4754 (మాతృ కృప), గోపాల్ పేట్ వీధి, నారాయణపేట్ పట్టణం, జిల్లా పిన్ కోడ్ :509210, సెల్ 9440835594

# జూరాలకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- 11గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- శ్రీశైలం డ్యాంకు పెరుగుతున్న వరద
- 3గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 17, ప్రభాతవార్త :** ఉమ్మడి పాలమూరు వరప్రదాయిని జూరాలకు ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులకు భారీ వరద వచ్చి చేరుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలకు జూరాలకు వరద పోటెత్తుతున్నది. దీంతో 11గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయానికి 1,00,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 5.282టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్‌హౌస్‌కు 38,818క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 77,946క్యూసెక్కులు, కుడి కాలువకు 640,ఎడమ కాలువకు 396 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. జూరాల నుంచి 1,17,846క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది.



జూరాల నుండి విడుదలవుతున్నవరద

### 881అడుగులకు చేరిన శ్రీశైలం

శ్రీశైలం జలాశయానికి వరద క్రమంగా పెరుగుతున్నది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు సుంకేసుల, జూరాల డ్యాంల నుంచి భారీగా వరద వచ్చి చేరుతున్నది. ఆదివారం సాయంత్రం 6గంటల సమాచారం మేరకు శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 38,818క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 77,946క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 49,632క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం 3గేట్ల ద్వారా 79,269క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకుగానూ 881.10అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 195.6605టీఎంసీలకు చేరింది. డ్యాంకు 1,78,101క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. విద్యుత్ ఉత్పత్తి కోసం 65,807క్యూసెక్కులు విడుదల చేయగా కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.


శ్రీశైలం డ్యాం నుంచి విడుదలవుతున్న వరద

## ఉపాధ్యాయుల సేవలను పరిగణలోకి తీసుకోవాలి



ఆమనగల్లులో మాట్లాడుతున్న అధ్యక్షులు కృష్ణ

**ఆమనగల్లు,ఆగస్టు17, ప్రభాతవార్త:** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సంధర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఉపాధ్యాయులకు స్థానం కల్పించాలని ఆమనగల్లు ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు కృష్ణ అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల ద్వారా ఉపాధ్యాయులు విద్యావ్యాప్తికి చేస్తున్న కృషిని ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక జాబితాను రూపొందించి పురస్కారాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆమనగల్లు మండల కేంద్రంలో శనివారం మండల ప్రైవేటు ఉపాధ్యాయ సంఘం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. సెప్టెంబర్5 జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురష్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఉపాధ్యాయుల కృషిని గుర్తించాలనికోరారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే చేయూతతో ఆత్మవిశ్వానంపెంపొందిరాష్ట్రంలోమరింతవిద్యాభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. ప్రైవేటు ఉపాధ్యాయుల కృషితో పోటీ పరీక్షలలో ప్రైవేటు పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధిస్తుందని, అలాగే ప్రైవేటువిద్యాసంస్థలలోప్రైవేటుఉపాధ్యాయులుగాపనిచేస్తూ సమాజానికి ఎంతోమంది ఉత్తమ పౌరులను అందిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బోడ నరేష్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి నజీర్, శ్రీనునాయక్, తదితరులు ఉన్నారు.

## అరవింద్‌కు ఉత్తమ కెమిస్ట్రీ అవార్డు




అవార్డును స్వీకరిస్తున్న పాపిశెట్టి రాము

**ఆమనగల్లు, ఆగస్టు17, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని సాయిరాం మెడికల్ అండ్ జనరల్ స్టోర్ ఫార్మసిస్టు పాపిశెట్టి అరవింద్‌కు ఉత్తమ అవార్డు వరించింది. కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్టు రంగంలో ఆయన సేవలను గుర్తించి రంగారెడ్డి జిల్లా కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్టు అవార్డు ప్రకటించింది. శనివారం ఆమనగల్లు పట్టణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గిన్నిస్ బుక్‌వరల్డురికార్డుఅవార్డుగ్రహీతపెండెంకృష్ణకుమార్ చేతుల మీదుగాపాపిశెట్టి అరవింద్ శాలువా సన్మానం, జ్ఞాపికను అందుకున్నారు. అవార్డు అందుకున్న అరవింద్‌ను మండల కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్టు ప్రతినిధులు నటరాజ్‌యాదయ్యగుప్త, ఉప్పల రాములు, పలు మెడికల్ షాపులయాజమాన్యాలు అభినందించారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శిసత్యనారాయణ,కోశాధికారిమహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పిల్లలకు ఆధ్యాత్మిక చింతన అలవర్చాలి



మహర్షి వేద గురుకులంలో హోమం నిర్వహిస్తున్న ఆచార్యులు

షాబాద్,ఆగస్టు 17, ప్రభాతవార్త: చిన్నతనము నుండే పిల్లలకు ఆధ్యాత్మిక చింతన అలవాటు చేయాలని మహర్షి సోమ శేఖర్ అన్నారు. షాబాద్ మండల పరిధిలోని బోనగిరిపల్లి గ్రామ సమీపంలో ఉన్న మహర్షి వేద గురుకులంలో ఆదివారం హోమం నిర్వహించి, ఎనిమిది మంది పిల్లలకు ఉపనయన సంస్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లలకు చిన్నతనము నుండే దైవచింతలను అలవర్చినప్పుడే వారు క్రమశిక్షణతో ఎదుగుతారన్నారు. భారతీయ సాంస్కృతిక, సంప్రదాయాలు మరుగున పడి పాశ్చాత్య పోకడలకు మనిషి అలవాటు పడుతున్నాడని అన్నారు. జీవనశైలిలో దైవచింతన అలవర్చుకోవాలని సూచించారు. గణపతి ఆచార్య, కేతన్ ఆచార్య, మహాజన్, పిల్లల తల్లిదండ్రులు, పాల్గొన్నారు

## ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి



మాట్లాడుతున్న సిఐ కాంతారెడ్డి

**షాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలని షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి అన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని గణేష్ మండపాల నిర్వహణతో పోలీస్ స్టేషన్లో ఎస్ఐలు సతీష్, శంకర్‌రెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గణేష్ మండపాలకు విద్యుత్, అగ్నిమాపక, తదితర ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద డీజే లకు అనుమతి లేదన్నారు. గణేష్ మండపాలకు ఆన్లైన్లో అప్లై చేసుకుని, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలందరూ ఐక్యమత్యంగా ఉంటూ, భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రామ్ లాల్. మండప నిర్వాకులు, తదితరులు ఉన్నారు.

### ఘనంగా మల్లన్న స్వామి బోనాలు

**షాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** షాబాద్ మండల పరిధిలోని మల్లారెడ్డి గూడ గ్రామంలో మల్లన్న స్వామి బోనాల పండుగ ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఏడు శ్రావణమాసంలో జరిగే మల్లన్న స్వామి బోనాల ఉత్సవాలు గ్రామస్తులు పెద్దలతో పూజలు చేసి తమ మొక్కలు తీర్చుకున్నారు. స్వామివారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. మహిళలు బోనాలు తీసుకొని, శివసత్తుల నృత్యాలు, పోతురాజుల విన్యాసాలతో గ్రామస్తులంతా ఊరేగింపుగా ఆలయం వరకు బయలుదేరి, నైవేద్యం సమర్పించి తమ మొక్కలు తీర్చుకున్నారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ అశోక్, మాజీ సర్పంచులు ప్రతాపరెడ్డి, మహేందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్,బోకుల లింగం కాంగ్రెస్ పార్టీ నాయకులు సుభాష్ రెడ్డి, కిషోర్ నాయక్, సూర్య బాయ్, దేవుల నాయక్, రాఘవేంద్ర స్వామి, బడుగు మల్లేష్ యాదవ్, రాహుల్, మాణిక్యం, మాధవరెడ్డి, కుమ్మరి బాలయ్య, కావలి శ్రీరాములు, ప్రభాకర్ రెడ్డి, అనంతరెడ్డి, యాదయ్య, సదానందం తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లులో ఉచిత ఆరోగ్య పరీక్షలు



ఆరోగ్య పరీక్షలను పరిశీలిస్తున్న చైర్మన్ సుంకిరెడ్డి

### -సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

**ఆమనగల్లు,ఆగస్టు17,ప్రభాతవార్త:** విధిగా ప్రాథమిక ఆరోగ్యపరీక్షలు చేయించుకుంటే వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చని ఐక్యత ఫౌండేషన్‌వ్యవస్థాపకచైర్మన్,టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు.గుర్తించిన వ్యాధులకు సకాలంలో వైద్యం పొందితే సంపూర్ణ ఆరోగ్యంగాజీవించవచ్చనిఆయన వెళ్ళడించారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాలో ఆదివారం ఐక్యత ఫౌండేషన్ మొబైల్ హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసింది. మొబైల్ క్యాంపు ద్వారా ప్రజలకు ఉచిత ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించింది. మెడిహబ్ ఆసుపత్రికి చెందిన నిపుణులు ఆరోగ్య పరీక్షలు చేశారు. శిబిరాన్ని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తొలిరోజు శిబిరానికి మంచి స్పందన లభించింది. దాదాపు 600 మంది హాజరుకాగా 400పైగా ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.రక్త నమూనాలు సేకరించి సిబిపి(కంప్లీట్ బ్లడ్‌పిక్చర్)నిర్వహించి ఆరోగ్యస్థితిగతులను వివరించారు. క్రియోటినిన్, యూరిన్, బిలిరుబిన్, కొలెస్ట్రాల్, కాల్షియం, గ్లూకోజ్ వంటిపరీక్షలు చేశారు.ఈసంధర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ సభలో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలఆరోగ్యసంరక్షణకుఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా చేపడుతున్నట్లు ఆయన వివరించారు. పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య భారంతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారికి అండగా నిలబడాలనే ఆశయంతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సుంకిరెడ్డి తెలిపారు. ఇంతకు ముందు మెగా కంటి ఆరోగ్య పరీక్షలు చేపట్టి ఉచితంగా కంటి అద్దాలు పంపిణతోపాటు అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అలాగే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టాలనే సంకల్పంతో ఉచితంగా మొబైల్ హెల్త్ క్యాంపులకు శ్రీకారం చుట్టామని వివరించారు. క్యాంపుల ద్వారా రక్తపరీక్షలు చేసి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ ంలోని అన్ని మండలాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తామని ప్రతిగడపకు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. మొబైల్ హెల్త్ క్యాంపులకు ప్రజల నుండి వస్తున్న స్పందన అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు మండ్లి రాములు, మాజీ ఉపసర్పంచ మల్లేశ్‌నాయక్, పురుషోత్తం, చంద్రునాయక్, కిషన్‌నాయక్, కుమార్, మల్లేశ్, నవీన్, తావ్‌నాయక్, తక్రియ, టాక్య, ఐక్యత ఫౌండేషన్ ప్రతినిధులురచ్చ శ్రీరాములు, శివ, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, రాఘవేందర్, ఉన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

## భగవంతుని ఆశీస్సులు అందరిపై ఉండాలి



నందిగామలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**నందిగామ ఆగస్టు17 ప్రభాతవార్త :** పవిత్ర శ్రావణమాసం పుణ్య దినాలలో భగవంతుని కరుణా కృప కటాక్షం ప్రజలందరిపై ఉండాలని భగవంతుని వేడుకుంటున్నానని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ఆదివారం నందిగామ మండల కేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నేత జిల్లెల్ల బాల్ రెడ్డి కవిత దంపతులు తమ స్వగృహంలో నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి రథ పూజల్లో పాల్గొన్నారు. వరుణ దేవుని ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ పూజలో షాద్నగర్ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కృష్ణారెడ్డి, ఏంసి డైరెక్టర్లు సి నర్సింలు, పిఏసిఎస్ మాజీ చైర్మన్ ర్నారెడ్డి, డైరెక్టర్ కుందారం వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీలు చెంది తిరుపతిరెడ్డి, దామోదర్ రెడ్డి, చంద్రపాల్ రెడ్డి, కొమ్ము కృష్ణ, కుమార్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, కావలి కృష్ణ, దాసరి నర్సింలు, ఇన్ముల్ నర్వ సుదర్శన్‌రెడ్డి, కుందారంర్నా రెడ్డి, ఎదురే శ్రీకాంత్‌గౌడ్, బి జంగయ్యగౌడ్, తుమ్మల నరసింహులు యాదవ్, ఎర్రగారి రమేష్,యాదగిరి, బిలింగం లు ఉన్నారు.

## సిపిఎం గ్రామ కమిటీ కార్యదర్శిగా కురుమత్యాల



చీపునంతల గ్రామ కార్యదర్శి గా కురుమయ్యన ఎంపిక చేసిన సిపిఎం నాయకులు ఎన్నికైన కురుమయ్య

**తలకొండపల్లి, ఆగస్టు17,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని చీపునంతల గ్రామంలో సిపిఎం గ్రామ కార్యదర్శిగా కురుమయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఎం ఆమంగల్ ఏరియా కమిటీ కార్యదర్శి పిప్పళ్ళ శివశంకర ఆధ్వర్యంలో ఆదివారం సమావేశమై గుమ్మడి కురుమయ్యను గ్రామ శాఖ కార్యదర్శి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కురుమయ్య మాట్లాడుతూ గ్రామ సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తానని ప్రభుత్వం అందజేసే పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందే విధంగా పనిచేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఆమనగల్ ఏరియా కమిటీ కార్యదర్శి పిప్పళ్ళ శివశంకర్, తొగరిపోచయ్య, కుత్ర మల్లేష్ మిడత రాజు నీరెడ్డి ప్రవీణ్ గుమ్మడి మల్లేష్ తదితరులున్నారు.

## సిఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న మహిళా కూలీలు



వరి నాట్లు వేయడానికి వెళ్తున్న మహిళా కూలీలు

**(నందిగామ,ఆగస్టు 17 ప్రభాతవార్త)** రోజు బస్సుల్లోస్త.. వరి నాట్లేస్తం.. ముదురుదేవ్నత..పత్తిచేనుకుమంద్నేస్త..జొన్నసేన్లు కల్నుస్త..పొదుమూకి మల్ల బస్సులో ఇంటికెళ్లి. సీఎం సార్ కడుపు సల్లగున్నడ ఆధార్ కార్డు చూపెడ్నత టికెట్ తీసుకున్నట. రోజు బస్సు చార్జీలు మిగిలి మాకు ఆ దేరువవుతుంది. కూరగాయలు కొంటాం, కళ్ళుతాగ్నుత, ఆకుజరద కొన్నట.మాకు మంచిగున్నది బిడ్డ.. పని దొరకని నాడు పట్నం పోతం. దేవుళ్ళ కాడికి వెళ్లి. దర్గాకోత.. మా బిడ్డ తానికోత.. సీఎం సారు మా ఆయుష్షు కూడ పోసుకొని నూరేళ్లు బతకాలని దినసరి మహిళా కార్మికులు, మహిళ వ్యవసాయ కూలీలు దీవిస్తూ మురిసిపోతున్నారు. రోజు కూరగాయలమ్మేవారు, పాలు పెరుగమ్మేవారికి కాయకష్టం చేసుకోని బ్రతికే వారికి ఉచిత బస్సు ద్వార ఎంతో మేలు జరుగుతుందన్నారు.

## బండోనిగూడలో సిసి రోడ్లు నిర్మాణం ప్రారంభం..

**(నందిగామ ఆగస్టు 17 ప్రభాతవార్త :** నందిగామ మండలం బండోనిగూడ గ్రామంలో ఆదివారం షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పసుల బుచ్చయ్య ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి కోసం నిధులు కేటాయించిన ఎమ్మెల్యేకు గ్రామశ్రీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు జాలగుడెం రాజు, ఉపాధ్యక్షుడు బక్కోళ యాదయ్య, నాయకులు కే. పాండు బి. మల్లేష్, జె. జనార్ధన్, జె. మల్లేష్, పి. శ్రీకాంత్, పి. బాలరాజు,బండ మల్లేష్, బుడమోళ శ్రీశైలం, మంచంపాటి సమూలయ్య, బండ పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండలఅధ్యక్షుడు గుజ్జరి రాఘవేందర్

**తలకొండపల్లిఆగస్టు17,ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ..జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గుజ్జరి రాఘవేందర్.. రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తలకొండపల్లి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చి, తీరా స్థానిక ఎన్నికల ముందు పార్టీపరంగా రిజర్వేషన్ ఇస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ..బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే ఎన్నికలకు వెళ్తామని ఏడాదిన్నర కాలంగా స్థానిక ఎన్నికలను ఆపినా సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు కూడా రిజర్వేషన్ కల్పించిన తర్వాత నే ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు... బీసీలను మభ్య పెట్టాలని చూడొద్దని, రిజర్వేషన్ సాధనకు ప్రభుత్వంతో కలిసి పోరాటానికి సిద్ధంగా ఉన్నామని అని తెలిపారు. త్వరలో మండలంలో బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, బీసీ సమాజాన్ని చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి బీసీలకు రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్మించాలని ఆయన మరోసారి డిమాండ్ చేశారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల ప్రధాన కార్యదర్శులు వట్టేల శ్రీశైలం యాదవ్, గోదా నరసింహ గౌడ్, కోవి సుబ్రమణ్యం, వట్టేల శేఖర్ యాదవ్, రాజమణి కృష్ణ, చంద్రకుమార్ పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణంపై మండిపడుతున్న ప్రజలు

### ప్రజల సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరిక

**నవాబుపేట,ఆగస్టు 17 ప్రభాతవార్త :** అభివృద్ధికి చిహ్నం సరైన రవాణ వ్యవస్థ అందులో ప్రధాన భూమిక రోడ్లది. ఈనేపథ్యంలో రోడ్లు సక్రమంగా ఉన్నపుడు ఆప్రాంతంఅభివృద్ధికి నోచుకుంటుంది. మండలానికి ప్రధానమైన ఆర్ అండ్ బీ రోడ్డు వికారాబాద్ మండలం పరిధి బంగారు మైసమ్మ ఆలయం నుండి మండల మీదుగా దాదాపు 20 కిలోమీటర్ల పొడవు సరిహద్దు గ్రామం మైతాబ్‌ఖాన్‌గూడ వరకు రోడ్డు ఉంది. ఈ రోడ్డు ధ్వంసం కావడంతో మండల ప్రజలు గగ్గోలు పెట్టి,నిరసనలు, రాస్తారోకోలు నిర్వహించడం, స్థానిక ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం, విమర్శలు ప్రతి విమర్శలు గుప్పించుకోవడం లాంటి కార్యక్రమాలు చేపడితే, ఎట్టకేలకు పుణనిర్మాంకోసం అధికారులు 14 కోట్ల రూపాయలకు పైగా నిధులనుమంజూరు చేశారు. అందుకు స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య కృషి ఎంతగానో ఉంది. దీంతో హట్టహసంగా కొన్ని సంత్సరాల క్రితం పనులను ప్రారంభించారు. కానీ నేటికీ పనులు పూర్తి కాలేదు. దీంతో ఈ రోడ్డు గుండా ప్రాయాణం చేయాలంటే వాహన చోధకుల వెన్నులోవనుకు పుడుతుంది. రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పనులు కొంత భాగాన్ని పూర్తి చేసినా, కొంత భాగాన్ని మధ్యలో వదిలేశారు ప్రస్తుతం రోడ్ల విషయం మండలంలో చర్చనీయాంశమైయింది. ఉరిమి ఉరిమి మంగళం మీద పడిన చంధంగా నాడు నేడు ఎమ్మెల్యేనే టార్‌గెట్ చేస్తూ నాయకులు విమర్శలు ప్రతి విమర్శలు చేసుకుంటున్నారు. కాంట్రక్టర్లు స్థానికులు కావడం నాయకులు వారికి తోత్తులుగా ఉండటంతోనే ఈ దుస్థితి ఏర్పడిందని పరిశీలకులు భావిస్తున్నారు. గత ఐదు సంవత్సరాలుగా మండల ప్రజలకు ఈ విషయం చర్చనీయాంశం కావడం విశేషం. ఇంత పెద్ద వ్యవస్థ ఉండగా ప్రజల గోస చూసి మండల పరిధిలోని పులుమామిడి గ్రామానికి చెందిన ఓ సాధరణ వ్యక్తి తన స్వంత నిధులతో ప్రధాన రోడ్డు గుంతల్లో మట్టి పోయించి కొంత ఊరట కలిడించడం పట్ల సర్వాత్ర అభినందించడం విశేషంగా చెప్పవచ్చు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్ల విషయంలో స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ బాలస్వామి

**ఘట్‌కేసర్,ఆగస్టు 17, ప్రభాతవార్త:** వినాయక ఉత్సవాలు శాంతియుతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి అన్నారు. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం శాంతతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గణేశ్ ఉత్సవాల నిర్వహకులు, అన్ని మతాల పెద్దలతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు. వినాయక ఉత్సవాలు జరిపే వారు పోలీసుల ఆదేశాలు పాటించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ తెలిపారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా గణేశ్ మండపాలను ఏర్పాటు చేయాలని నిమజ్జనం సమయంలో ప్రశాంత వాతావరణం ఉండాలన్నారు. పోలీసు శాఖ నిబంధనలను పాటించి మండపాల సమాచారం ఇవ్వాలని, విద్యుత్ అనుమతి పొందాలన్నారు. ఎస్ఐలు శేఖర్, ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, మాజీ ఎంపిటిసి గోపాల్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి.ఇక్బాల్, నాయకులు ముల్లి జంగయ్యయాదవ్, అంజనేయులు, రవికాంత్‌రెడ్డి, సంజీవరెడ్డి, అబ్దుల్‌అజీజ్, కుతుబుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## యాదవసంఘం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**ఘట్‌కేసర్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ద్వాపర యుగంలో జన్మించిన శ్రీకృష్ణుడు నేటి కలియుగానికి ఆదర్శంగా నిలుస్తారని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ బాలాజీనగంలో త్రైత సిద్దాంతము సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా శ్రీకృష్ణభగవాన్‌కి పూలు, పండ్లు, నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసంలో జరుపుకునే శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పళ్లు, అటుకులు, బెల్లం కలిపిన వెన్న, పెరుగు, మీగడను స్వామికి నైవేద్యంగా పెట్టి శ్రీకృష్ణ కీర్తనలు పాడారు. మాజీ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్ శ్రీకృష్ణ పూజలో పాల్గొని కొబ్బరికాయ కొట్టి సమర్పించారు. ఈకార్యక్రమంలో మైసయ్య, కేస్కార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం యాదవ సంఘంలో అధ్యక్షులు రాజబోయిన యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్‌తో పాటు ఆమె పాల్గొని మాట్లాడారు. శ్రీకృష్ణునికి నైవేద్యం ఆరగింపు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈకార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షులు రామకృష్ణయాదవ్, ప్రధానకార్యదర్శి వీరేందర్‌యాదవ్, చిత్తారియాదవ్, సత్యనారాయణ, అంజనేయులు, పొన్నయ్య, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## ఆర్మీ మేజర్ నరేశ్‌గౌడ్‌కు సన్మానం

**ఘట్‌కేసర్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న ఆర్మీ మేజర్ పల్లె నరేశ్‌గౌడ్‌కు ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి సన్మానం చేశారు. పోచారం మున్సిపల్ నారపల్లిలోని మాజీ ఎంపిటిసి పల్లె మాధవ బిక్షపతిగౌడ్ కుమారుడు ఆర్మీ మేజర్ నరేశ్‌గౌడ్‌ను ఆయన కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్ణయాత్మక సాయుధదళాల శక్తి మేరకు ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొని ఇంటికి విచ్చేసి నరేశ్‌ను అభినందించి సత్కరించారు. త్రివిధ దళాలకు అందిస్తున్న ఆధునాతన యుద్ధ సామాగ్రి అనుక్షణం సైన్యానికి నైతిక స్థైర్యం పెంచిన వివరాలపై మేజర్‌తో సుదర్శన్‌రెడ్డి చర్చించారు.

## సిపిఐ మహాసభలను విజయవంతం చేయాలి

**శామీర్‌పేట, ఆగస్టు 17, ప్రభాతవార్త:**

సిపిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర మహాసభల్లో పలు తీర్మాణాలు ప్రవేశపెట్టటం జరుగుతుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డిజి సాయిలుగౌడ్ పేర్కొన్నారు. శామీర్‌పేట సొసైటీ చైర్మన్,డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డిని సిపిఐ నాయకులు కలిసి సిపిఐ రాష్ట్ర మహాసభల కోసం విరాళాలు సేకరించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డిజి సాయిలుగౌడ్ మాట్లాడుతూ రైతు సేవా సహకార సంఘాల బలోపేతంకు, కౌలురైతులకు సబ్సిడీపై విత్తనాలు,ఎరువులు, పనిముట్లు అందించాలని, పండించిన పంటలకు ప్రభుత్వం మద్దతు ధర చెల్లించాలని రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని మహాసభల్లో పలు తీర్మాణాలు ప్రవేశపెట్టటం జరుగుతుందన్నారు. రైతులు, ఈ నెల 20నుంచి 23వ తేదీ వరకు రాష్ట్ర సిపిఐ 4వ మహాసభలు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని గాజులరామారంలో జరుగుతున్నట్లు డిజి సాయిలుగౌడ్ వివరించారు. అదే విధంగా సొసైటీ వైస్‌చైర్మన్ ఎం.ఐలయ్యయాదవ్, డైరెక్టర్ వంగ భూమిరెడ్డి కూడ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు డిజి సాయిలుగౌడ్‌తో పాటు శామీర్‌పేట మండల సిపిఐ కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్, మూడుచింతలపల్లి మండల కార్యదర్శి టి.రాములుగౌడ్ పాల్గొన్నారు.

## గంజాయి రవాణా చేస్తున్న నలుగురిపై కేసు నమోదు




**తలకొండపల్లి ఆగస్టు17,ప్రభాతవార్త :** మనగల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వి. జానకిరామ్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం....శుక్రవారం తలకొండపల్లి ఎక్స్ రోడ్ దగ్గర తలకొండపల్లి ఎస్సై కె.శేఖర్ మరియు వారి సిబ్బంది వాహనాలు తనిఖీ చేయుచుండగా ఒక స్విఫ్ట్ కారు కడ్తాల్ వైపు నుండి తలకొండపల్లి ఎక్స్ రోడ్ వైపు వస్తుండగా అట్టి స్విఫ్ట్ కారును పోలీసులు ఆపుతుండగా కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు కారు ఆపి పారిపోతుండగా పోలీసులు పట్టుకొని చెక్ చేయగా ఒక పార్సెల్ కవర్ అనుమానాస్పదంగా కనిపించింది. దాంతో పోలీసులు దాన్ని కట్ చేసి చూడగా అందులో నుంచి ఘాటైన వాసన కాగిన గంజాయి ఉంది. వెంటనే ఇద్దరు పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి గంజాయిని, మరియు ఒక స్విఫ్ట్ కారును రెండు సెల్ ఫోన్స్ ను స్వాధీనం చేసుకొని నిందితుల గురించి తెలుసుకునగా తలకొండపల్లి గ్రామానికి చెందిన పద్మ వెంకటేష్, కట్టమళ్ల రఘువరన్ గా గుర్తించారు. తర్వాత ఈ గంజాయి మీకు ఎక్కడి నుంచి వచ్చిందని ఇద్దరినీ విచారించగా పద్మ వెంకటేష్ స్నేహితులు హైదరాబాద్ ఉప్పల్ ప్రాంతానికి చెందిన జోగు రాజు, పిల్లి ప్రణయ్ అనే నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుండి 287 గ్రాముల గంజాయి,ఒక స్విఫ్ట్ కారు, ఒక స్కూటీ మరియు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి నిందితులను ఈ రోజు రిమాండ్ కు తరలించారు.కేసు లో నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ కె.శేఖర్, క్రైమ్ కానిస్టేబుల్ బి.జాషువా, కానిస్టేబుల్ శ్రీను,

## ముత్యాలమ్మ బోనాలకు హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి

**తలకొండపల్లి ఆగస్టు 17, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోగల రామకృష్ణాపురం గ్రామంలో ఆదివారంనాడు నిర్వహించిన ముత్యాలమ్మ బోనాలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైనారు. గ్రామంలోని ముత్యాలమ్మ దేవతకు గ్రామస్తులు బోనాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామ దేవత ఆశీస్సులు గ్రామస్తులు అందరికీ ఉండాలని, గ్రామంలో పంటలు విరివిగా పండే గ్రామస్తులందరు సుఖశాంతులతో ఉండాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి జోగు రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.మెదక్ పల్లిలో కోట మైసమ్మ విగ్రహం ప్రతిత్తలకొండపల్లి మండల పరిధిలోని మెదక్ పల్లి గ్రామంలో నూతనంగా ప్రతిష్టించిన కోట మైసమ్మ విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్టించారు. గ్రామంలో నీ కోట మైసమ్మ దేవాలయం నీ కోట మైసమ్మ దేవాలయం చిత్రవస్థకు శిథిలావస్థకు చేరుకోవడంతో కసిరెడ్డి యాదగిరి రెడ్డి చొరవ తీసుకొని నూతనంగా దేవాలయాన్ని నిర్మించి ఆదివారం నాడు గ్రామస్తులందరితో కలిసి కోట మైసమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే నర్సిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి యాదిరెడ్డి సుధాకర్ రెడ్డి అల్వాల్ రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నార